ప్రజాశక్తి
శుక్రవారం 3 ఫిబ్రవరి 2023
5
శ్రీ సత్యసాయి



గ్రేడ్-2 మున్సిపాలిటీగా పుట్టపర్తి

ఉత్తర్వులను జారీచేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి నగర పంచాయతీ గ్రేడ్-2 మున్సిపాలిటీగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ గురువారం విజయవాడలో జీవో 32ను విడుదల చేశారు. ఈ జీవోలో పుట్టపర్తి నగర పంచాయతీలో సంవత్సర ఆదాయం 4.47 కోట్లు వస్తోందని, వివిధ రాష్ట్రాల, విదేశాల నుంచి ఏట దాదాపు ఆరు లక్షల మంది సత్యసాయి మహా సమాధిని దర్శిస్తున్నట్లు వివరించారు. నగర పంచాయతీ కమిషనర్, కౌన్సిల్ సభ్యులు గతేడాది నవంబర్‌లో చేసిన తీర్మానాన్ని పరిశీలించి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొందన్నారు. జనాభా కూడా 40 వేలకు చేరుకుందని తెలిపారు. సత్యసాయి జిల్లాగా ఏర్పడినందున అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని జీవో విడుదల చేశామన్నారు. దీంతో మున్సిపాలిటీకి అధిక నిధులు వచ్చే అవకాశం ఉందని పుట్టపర్తిలో పలువురు హర్షం వ్యక్తం చేశారు. అలాగే మున్సిపాలిటీ గ్రేట్-2గా మార్చడానికి స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఎంతో కృషి చేశారని గురువారం సాయంత్రం ఎమ్మెల్యే కార్యాలయంలో తగర పంచాయతీ ఛైర్మన్ ఓబుళపతి, ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.



పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయం



తుంగ'భద్రమే'నా..!

- ◆ భద్రపై ప్రాజెక్టులకు కేంద్రం నిధులు
- ◆ వర్షాభావ పరిస్థితుల్లో 'అనంత'కు ఇబ్బందులు తప్పవా..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తుంగభద్ర డ్యామ్ ఎగువ భాగంలో కర్నాటక చేపట్టిన భద్ర ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం 2023-24 బడ్జెట్‌లో రూ.5300 కోట్లు కేటాయించింది. తుంగభద్ర డ్యామ్‌పై తుంగ,భద్ర నదుల రెండూ కలసి తుంగభద్రగా హొస్పేట్ వద్ద ఏర్పడుతాయి. కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మూడు రాష్ట్రాలకు నీటిని అందించే బహుళార్థక ప్రాజెక్టు ఇది. ఈ ప్రాజెక్టు ప్రారంభంలో 130 టిఎంసిల సామర్థ్యంతో నిర్మించారు. అయితే పూడిక కారణంగా ప్రస్తుతం దీని నీటి నిలువ సామర్థ్యం 100 టిఎంసిలకు పరిమితమైంది. ఈ ప్రాజెక్టు నుంచి అనంతపురం జిల్లాకు సాగునీటిని అందించే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ (హెచ్‌ఎల్‌సి) కర్నూలు జిల్లాకు సాగునీటిని అందించే తుంగభద్ర దిగువ కాలువ (ఎల్ఎల్‌సి)కు 70 టిఎంసిల నీటి కేటాయింపులున్నాయి. అందులో అనంతపురం జిల్లాకు మాత్రమే చూసినప్పుడు 32.50 టిఎంసిల నీరు కేటాయించారు. పూడిక కారణంగా తుంగభద్ర డ్యామ్‌లో నీటి నిలువ సామర్థ్యం తగ్గడంతో ఇప్పుడు ఏటా సగటున దామాషా పద్ధతిలో కేటాయిస్తున్న నీరు 23.50 టిఎంసిల వరకే ఉంటోంది. అనంతపురం జిల్లాకు వచ్చే ఈ నీటిలో పది టిఎంసిలకు పైగా తాగునీటి అవసరాలకే వాడుతున్నారు. నీటి ప్రవాహ నష్టం అన్నీ పోనూ ఆరేడు టిఎంసిల వరకే సాగునీటికి వినియోగిస్తున్నారు. దీంతో తుంగభద్ర డ్యామ్‌కు ఎగువ భాగంలో కర్నాటక రాష్ట్రం తుంగ, భద్ర నదులపై ప్రత్యేకంగా ప్రాజెక్టులు నిర్మిస్తుండటంతో ఆంధ్రప్రదేశ్‌కు కొన్ని అభ్యంతరాలూ ఉన్నాయి. డ్యామ్‌కి పైభాగంలో ప్రాజెక్టులు నిర్మిస్తే వర్షాలు అధికంగా వచ్చిన సమయంలో పెద్దగా సమస్య ఉండకపోవచ్చు. వర్షాభావ పరిస్థితులు నెలకొని ఆలస్యమైన సమయంలో ప్రాజెక్టుల్లోకి నీరు రావడం ఆలస్యమయితే దిగువనున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, దిగువ ప్రధాన కాలువలకు నీటి విడుదలలోనూ జాప్యం జరిగే అవకాశాలున్నాయి. ఈ రెండు జిల్లాలు కూడా కరువు ప్రాంతాలుగానున్నవే కావడం గమనార్హం. తుంగభద్ర డ్యామ్‌లో నీరు రావడం ఆలస్యమయితే ఈ ప్రాంతాల్లో తాగునీటి సమస్య సైతం ఉత్పన్నమయ్యే అవకాశాలూ లేకపోలేదని నిపుణులు హెచ్చరిస్తుండటం గమనార్హం.

భద్రాపై ప్రాజెక్టుకు కేంద్రం అనుమతి...
రూ.5300 కోట్లు కేటాయింపు..

రాయలసీమలోని కరువు ప్రాంతాలకు ప్రధానమైన తుంగభద్ర డ్యామ్‌కు పైభాగంలో చేపట్టిన ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.5300 కోట్ల నిధులను కేటాయించింది. 29.75 టిఎంసిల సామర్థ్యంతో కర్నాటక రాష్ట్ర ఈ ప్రాజెక్టును చేపట్టింది. ఇది పూర్తయితే సుమారు 30 టిఎంసిల నీరు ముందు భద్రాలో నిలువ అయిన తరువాత తుంగభద్ర డ్యామ్‌లోకి వస్తాయి. ఇటువంటి ప్రాజెక్టుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిధులు కేటాయించింది. వెనుకబడిన రాయలసీమ ప్రాజెక్టుల్లో ఒకటైన హంద్రీనీవాకు విభజన సమయంలో తోడ్పాటు అందిస్తామని చెప్పిన మాటను మాత్రం పట్టించుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కర్నూలులో తుంగభద్ర దిగువను నిర్మించ తలపెట్టిన గుండ్రేవులకు నిధుల కేటాయింపులపై పెదవి విప్పకపోవడం ఆ ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారపార్టీ నేతలు పెదవి విప్పాలి
వి.రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి.

రాయలసీమ ప్రాంతానికి నష్టం జరిగే విధంగా కేంద్రంలోని బిజెపి అప్పర్ భద్రకు నిధులు కేటాయించడంపై రాష్ట్రంలోని అధికారపార్టీ వైసిపి నేతలు పెదవి విప్పాలి. ఇప్పటికే తుంగభద్ర పూడికతో జిల్లాకు నీటి కేటాయింపులు తక్కువగా ఉన్నాయి. మొదట దామాషా పద్ధతిలో కేటాయించి 32.50 టిఎంసిలు, కెసి కెనాల్ డైవర్షన్ ద్వారా రావాల్సిన పది టిఎంసిలు కలిపి జిల్లాకు 42.50 టిఎంసిలు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు రావాల్సి ఉంది. అయితే ప్రస్తుతం 25 నుంచి 27 టిఎంసిల్లోపే జిల్లాకు వస్తోంది. ఇటువంటి సమయంలో తుంగభద్ర ఎగువ భాగంలో మరో ప్రాజెక్టు చేపడితే వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమయంలో ఈ ప్రాంతానికి నీటిని తీసుకురావడంలో తీరని నష్టం జరుగుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు చేపట్టాలి. రాయలసీమ డిక్లరేషన్ గురించి మాట్లాడే బిజెపి నేతలు దీనిపై స్పందించాలి.

వేగవంతంగా రహదారుల భూసేకరణ, రీసర్వే పనులు

కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సత్యసాయి జిల్లాలో జాతీయ రహదారులకు భూ సేకరణ, భూ హక్కు, భూ రక్ష, రీ సర్వే పనులన త్వరగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ బసంత్‌కుమార్ తెలిపారు. గురువారం విజయవాడ నుంచి భూ సేకరణ, రీ సర్వే వ్యవసాయం, గృహ నిర్మాణం, స్పందన గ్రీవెన్స్ తదితర అంశాలపై రాష్ట్ర చీఫ్ సెక్రటరీ డాక్టర్ జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయా జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. ఈ కాన్ఫరెన్స్ లో కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెక్రటరీ డాక్టర్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాధాన్యత కనుగుణంగా, జాతీయ రహదారులకు భూ సేకరణ ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం కింద రీసర్వే పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. మొదటి రెండవ దశలలో చేపట్టిన పనుల ప్రగతిలపై సమీక్షించారు. రీ సర్వే పనులు గడువులోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం గ్రౌండింగ్ వేగవంతం చేయాలన్నారు. చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచడానికి రైతులను అవగాహన సలహాలు సూచనలు చేపట్టాలన్నారు. బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ల నిర్మాణం గృహ నిర్మాణాల ప్రత్యేక శ్రద్ధ పెట్టి పూర్తి చేయాలన్నారు. అన్ని తీసుకుంటున్నామని కలెక్టర్ సెక్రటరీకి వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఓ విజయ్ కుమార్, పిఆర్ఎస్ఈ గోపాల్‌రెడ్డి, వ్యవసాయ అధికారి సుబ్బారావు, గృహ నిర్మాణ పీడీ చంద్రమౌళిరెడ్డి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డిపిఓ విజయ్‌కుమార్‌రెడ్డి, డిఇఓ మీనాక్షి, సిరికల్చర్ జిల్లా అధికారి పద్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ బసంత్‌కుమార్, జెసి టిఎస్ చేతన్

క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలి

కమిషనర్ మల్లికార్జున

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రతి విద్యార్థినీ క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని కమిషనర్ మల్లికార్జున, ఇన్‌ఛార్జి ఎఇఓ సుధాకర్‌నాయక్ సూచించారు. ఈమేరకు బుధవారం స్థానిక మున్సిపల్ బిఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థినులకు అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పతి విద్యార్థినీ కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. అప్పుడే మంచి మార్కులు సాదించవచ్చున్నారు. ప్రతిఏడాది లాగే పదిలో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నీలూరి వెంకటరాముడు, కేతా లోకేష్, మాజీ కౌన్సిలర్ బీరే ఎర్రిస్వామి, పాఠశాల కమిటీ అధ్యకుడు జైముతక రమణ, ఉపాధ్యక్షుడు నూర్జాహాన్, పాఠశాల హెచ్ఎమ్ ఉమాపతి, ఉపాధ్యాయులు రామకృష్ణనాయక్, హరికంకర్, మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు అల్పాహారం అందజేస్తున్న కమిషనర్ మల్లికార్జున, ఎంఇఓలు

5న ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

యువర్స్ ఫౌండేషన్ సౌజన్యంతో పట్టణంలోని బాలుర ఉన్నతపాఠశాలలో ఈనెల 5న ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు వైకె శ్రీనివాసులు, కార్యదర్శి సుంకుసుకుమార్లు తెలిపారు. ఈమేరకు గురువారం యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ యువర్స్ ఫౌండేషన్ సౌజన్యంతో కర్నూల్‌కు చెందిన శ్రీచక్ర ఆసుపత్రి వారు వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వైద్యశిబిరం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కోశాధికారి రాధాకృష్ణ, సభ్యులు డాక్టర్ సుబ్బారావు, చాంద్‌బాషా, పోలా ప్రభాకర్, వాసుదేవుడు, జయరాం, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్‌నిర్మాణం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

దాదాపు రూ.2కోట్ల నుంచి రూ.3కోట్ల వరకూ వెచ్చించి పట్టణంలోని సిద్ధయ్యగుట్టలో ఉన్న అతి పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయం పున్ణనిర్మాణం చేపట్టినట్లు ఆలయ అభివృద్ధి సంఘం అధ్యక్షురాలు జయశ్రీ, ఉపాధ్యక్షులు పుట్లూరు నరసింహులు తెలిపారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతల సహకారంతో ఆలయ పునర్‌నిర్మాణ పనులను ప్రారంభించనున్నామని తెలిపారు. ఇందులో భాగంగా 4న మహా గణపతి పూజ, హోమాలతోపాటు లక్ష్మీనరసింహస్వామి మాలమంత్ర, సుదర్శన కళాపకర్షణ బాలాలయ ప్రవేశ శాంతి హోమాలు, పూర్ణాహుతి నిర్వహించనునున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి సంఘం కార్యదర్శి గంజికుంట బాలగంగాధర్, కోశాధికారి కలవల మురళీధర్, డైరెక్టర్లు అజంతా కృష్ణ, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి సంఘం సభ్యులు



క్లస్టర్ ఇన్‌ఛార్జితో మాట్లాడుతున్న నియోజకవర్గ పరిశీలకులు వైకుంఠం మల్లికార్జున

2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

నియోజకవర్గ టిడిపి పరిశీలకులు వైకుంఠం మల్లికార్జున

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఇదేం ఖర్మ..మనరాష్ట్రానికి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని 2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని నియోజకవర్గ టిడిపి పరిశీలకులు వైకుంఠం మల్లికార్జున పిలుపునిచ్చారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, క్లస్టర్ ఇన్‌ఛార్జి, మండల నాయకులు, ఐటిడిపి సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజావ్యతిరేక ప్రభుత్వం నడుస్తోందన్నారు. ముఖ్యంగా సిఎం జగన్ విధ్వంసకరపాలన సాగిస్తున్నారన్నారు. వైసిపికి వ్యతిరేకంగా ఓటు వేయడానికి ప్రజలందరూ సంసిద్ధులయ్యారన్నారు. కావున ప్రభుత్వ వ్యతిరేక వర్గాలను ఓటు రూపంలో మలుచుకోవాలనని సూచించారు. అదేవిధంగా ఇదేం ఖర్మ-మనరాష్ట్రానికి కార్యక్రమం నియోజకవర్గంలో జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. దీంతోపాటు ఓటరు వెరిఫికేషన్‌పై కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పెద్దఎత్తున డబుల్ ఓట్లు, షిఫ్టింగ్ ఓట్లు, పెళ్లి అయిన వారి ఓట్లు ఉన్నట్టు తెలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కమతం కాటమయ్య, ఫణికుమార్, పురుషోత్తంగౌడ్, పోతుకుంట లక్ష్మన్న, నాగూరుహుస్సేన్, అత్తర్ రహీంబాషా, అంబటి సనత్, రాళ్లపల్లి షరీఫ్, చింతపులుసు పెద్దన్న, గోసల శ్రీరాములు, కేశగాళ్ల శీన, తోట వాసుదేవ, చెలిమి శివరాం, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు అందించే పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సిడిపిఓ లక్ష్మి, జిల్లా కోఆర్డినేటర్ మహేష్ తెలిపారు. గురువారం స్థానిక ఆర్డీఓ సమావేశ భవనంలో ధర్మవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తం తక్కువగా ఉండే గర్భవతులు, బాలింతలను గుర్తించి వారు సరిగ్గా ఆహారం తీసుకుంటున్నారా లేదా అని పరిశీలించాలని తెలిపారు. ఎత్తు తక్కువ ఉంటున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల్లో మెను ప్రకారం భోజనం, పౌష్టికాహారం అందించాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అంగన్వాడీ టీచర్లు సక్రమంగా చేసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు రికార్డులు సక్రమంగా పెట్టుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లోని టీచర్లు, హెల్పర్లు ఖచ్చితంగా యూనిఫారం ధరించాలని ఆదేశించారు. యాప్‌లో మీరు రోజూ చేయాల్సిన పనులు, గర్భవతులు, బాలింతలు, చిన్నారులు భోజనం చేసే ఫొటోలు, మీరు వండిన వంట ఫొటోలను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అరుణ, రాజేశ్వరి, శైలజ, లతాకిరణ్, దేవమణి, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సెంట్రింగ్ పనులు చేస్తూ కిందపడిన కార్మికుడు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని వరలక్ష్మి థియేటర్ సమీపంలో గురువారం సాయంత్రం నూతన ఇంటి నిర్మాణం కోసం సెంట్రింగ్ పనులు చేస్తున్న చిన్నూరు గ్రామానికి చెందిన సెంట్రింగ్ కార్మికుడు శ్రీనివాసులు పైనుంచి కిందపడటంతో నడుముకు తీవ్రగాయాలయ్యాయి. తోటి కార్మికులు గమనించి వెంటనే అతన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పశువుల అంబులెన్స్ ప్రారంభం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని మైలాపురం గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పశువుల అంబులెన్స్‌ను విప్ కాపు రామచంద్రారెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషులతో పాటు పశువులకు సైతం ఉచిత వైద్య అంబులెన్స్ ఏర్పాటు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. పశువులకు చికిత్సతోపాటు అత్యవసర సేవలు, ఆపరేషన్లు అవసరమైన వారు 1962 నెంబర్‌కు ఫోన్ చేస్తే వారే వచ్చి ఉచితంగా వైద్య సేవలు అందిస్తారన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, పశువైద్య డాక్టర్ వెంకటరెడ్డి, సచివాలయ సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

అధ్యాపకుల ప్రతిభకు పరిశోధన ప్రాజెక్టు కొలమానం

ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

అనంత జెఎన్‌టియు పరిధిలోని అధ్యాపకులు పరిశోధన ప్రాజెక్టులను సాధించే దిశగా అడుగులు వేయాలని, అప్పుడే వర్సిటీ మరింత అభివృద్ధి సాధిస్తుందని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి సూచించారు. గురువారం సాయంత్రం వర్సిటీ ఉపకులపతి ఛాంబర్‌లో యూనివర్సిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. అలాగే పరిశోధన కార్యకలాపాలను అధ్యాపకులు మరింత ముందుకు తీసుకెళ్లే విధంగా కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా విద్యార్థులకు మైనర్స్, డిగ్రీ, హానర్స్ డిగ్రీపైన మరింత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఇంటర్న్‌షిప్ పూర్తి చేసేలా ప్రతి అధ్యాపకుడూ పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, యూనివర్సిటీ డైరెక్టర్లు వి.సుమలత, ఇ.కేశవరెడ్డి, కిరణ్మయి, సి.శోభాబిందు, భువన విజయ, పద్మ సువర్ణ, సుబ్బారెడ్డి, ఎ.సురేష్‌బాబు, బి.ఈశ్వర్‌రెడ్డి, అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, వైస్ ప్రిన్సిపాల్ భవానీ, వర్సిటీ పీఆర్ఓ ఎం.రామశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి

నిస్సహాయ రైతులను చైతన్యం చేయడమే 'జీవనరేఖ' లక్ష్యం

జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్

ప్రజాశక్తి-అనంతపురం

వ్యవసాయానికి పెట్టిన పెట్టుబడులు తిరిగి రాక నిస్సహాయులైన రైతులు ఆత్మహత్య వైపు వెళ్లకుండా చైతన్య పరిచేందుకే జీవన రేఖ కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.చంద్రానాయక్ తెలిపారు. గురువారం అనంతపురం రూరల్ మండలంలోని చియ్యేడు గ్రామంలో జీవన రేఖ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో భాగమైన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. సరైన సమయంలో సాంకేతిక సలహాలు అందించడం ద్వారా అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉందన్నారు. అంతేగాకుండా సకాలంలో పంట రుణాలు చెల్లించే రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం, వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాలు అందించడం, రైతులపై ఎలాంటి ఆర్థికభారం పడకుండా వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా పతకం ద్వారా రైతులందరి తరపున బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ప్రకృతి విపత్తుల ద్వారా జరిగిన పంట నష్టానికి అదే పంట కాలంలో నష్ట పరిహారం చెల్లించడం, విత్తనాలు, ఎరువులు సూక్ష్మ నీటి పారుదల వ్యవస్థ వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు భానూజా, అనంతపురం వ్యవసాయ డివిజన్ ఎడిఎ వెంకటరాముడు, మండల వ్యవసాయ అధికారి పి.వెంకటేశ్వరప్రసాద్, ఎఇఓలు ప్రసాద్, మురళి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ భువనేశ్వరి, గ్రామా రైతులు పాల్గొన్నారు.



రైతులకు పత్రాలు అందజేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్

పోక్సో చట్టం కింద కేసు నమోదు

ప్రజాశక్తి-చిలమత్తూరు

నల్లరాళ్ల పల్లిలో 13 ఏళ్ల బాలికపై జరిగిన ఆత్యాచారయత్నం ఘటనలో 35 ఏళ్ల నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. బాలిక తల్లితండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారించామన్నారు. ఇందులో భాగంగా పుట్టపర్తి డిఎస్పీ (హిందూపురం ఇన్‌ఛార్జి) యశ్వంత్ గురువారం నేరుగా బాధితులతో ఘటనపై విచారించారు. విచారణ అనంతరం పూర్వాపరాలను తెలుసుకుని నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



సజ్జల రామకృష్ణారెడ్డితో ఇస్మాయిల్

మైనార్టీల సమస్యలపై 'సజ్జల'కు వినతి

కదిరి అర్బన్ : మైనార్టీల సమస్యలపై కదిరి వైసిపి మాజీ సమన్వయకర్త.ఎస్ఎండి ఇస్మాయిల్ విజయవాడలో ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. విజయవాడలో జరిగిన వైసిపి రాష్ట్ర స్థాయి మైనారిటీ ముఖ్య నాయకుల సమావేశంలో రాష్ట్రంలోని ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలపై సజ్జల రామకృష్ణారెడ్డికి, డిప్యూటీ ముఖ్యమంత్రి అంజాద్‌బాషాకు వినతి పత్రం సమర్పించారు.

స్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలి

నల్లచెరువు : ఉద్యోగులు తమ విధినిర్వహణలో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించాలని ఎంపిడిఒ శకుంతల కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం గ్రామపంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ సహాయకులు, డిజిటల్ సహాయకులు, సచివాలయ ఎఎన్ఎంలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సచివాలయాలలో విధులు నిర్వర్తించే ఉద్యోగులు స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను విధించుకొని వాటిని నెరవేర్చే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి గణే నాయక్, ఎపిఎం రమణమ్మ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నిహారిక, మండల విద్యాధికారి తిరుపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్లో రాష్ట్రానికి అన్యాయం

గోరంట్ల : కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్రానికి నిధులు కేటాయించకపోవడం అన్యాయమని ఈ విషయంలో రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరసింహులు విమర్శించారు. విభజన సమయంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీలకు బడ్జెట్లో నిధులు కేటాయించలేదన్నారు. అలాగే రాష్ట్ర రాజధాని, పోలవరం ప్రాజెక్టులకు నిధులు ఇవ్వలేదన్నారు. గోరంట్ల మండలంలో కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నాసిన్, భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్, ఎయిర్ బస్ కంపెనీల అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు. రాష్ట్రానికి కేంద్రం నిధులు కేటాయించుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వ ఎంపీలు విఫలమయ్యారని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి రాష్ట్రానికి ప్రత్యేక నిధులు కేటాయించేలా చూడాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ సమస్య పరిష్కారం

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని పెడపల్లి పెద్ద తండాలో మూడు నెలల నుండి నెలకొన్న లోవోల్టేజీ సమస్య గురువారం పరిష్కారం అయింది. ఈ మేరకు విద్యుత్ అధికారులు గ్రామానికి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఎంపిటిసి సరస్వతి బాయి, రవి నాయక్ ,వార్డు మెంబర్ లక్ష్మీబాయి, రవి నాయక్ చొరవతో సమస్య పరిష్కారం కావటంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

సుస్థిరాభివృద్ధిపై అవగాహన

చిలమత్తూరు : అంగన్ వాడీ కేంద్రాలలో నిర్వహించే (ఎస్ డీ పి ఎస్) సుస్థిర అభివృద్ధి స్వాలంబన కార్యక్రమం పై స్థానిక బీసి కాలనీలోని అంగన్ వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సీడీపీవో రెడ్డి రమణమ్మ అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం లో కొడికొండ, కోడూరు, చిలమత్తూరు, దేమకేతేపల్లి నాలుగు పంచాయతీలలో గల అంగన్ వాడి కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్ వాడీ కేంద్రాల నిర్వహణ, పరిశుభ్రత, రికార్డుల అప్డేట్, ప్రీ స్కూల్, మెస్ విజిట్స్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు శ్రీ లక్ష్మి, మంజుళ తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్‌గా పద్మజ

బుక్కపట్నం : బుక్కపట్నం నూతన సబ్ రిజిస్ట్రార్‌గా పద్మజ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ నాయక్ కర్నూల్‌కు బదిలీ కాగా, హిందూపురంలో విధులు నిర్వహిస్తున్న పద్మజ బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సబ్ రిజిస్టర్ కార్యాలయ పరిధిలో క్రయ విక్రయదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విధులు నిర్వహిస్తానని చెప్పారు.

ఘనంగా ఉపాధి హామీ ఆవిర్భావ దినోత్సవం

అమరాపురం : స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో గురుఆరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న. జెడ్పీటీసీ వారక్క నరసింహామూర్తి, నాయకులు కృష్ణమూర్తి, ఎంపీడీవో మునిస్వామి, ఏపీవో తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి పథకం అమలు వల్ల కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు మంజునాథ్, నవీన్ కుమార్, వీరలింగప్ప, రమేష్, రాజన్న, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

లేపాక్షి : మండల పరిధిలోని కోడిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సిడిపిఒ రెడ్డి రమణమ్మ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో అందిస్తున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జయమ్మ, అంగన్వాడీ కార్యకర్త లీలావతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో సౌకర్యాల పరిశీలన

లేపాక్షి : మండల కేంద్రంలోని దుర్గా పాపానేశ్వర ఆలయంలోని సౌకర్యాలను అధికారులు పరిశీలించారు. కర్నాటక డివైఎస్ఒ కుమారప్ప ఆధ్వర్యంలో సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో జి 20 సభ్యులు ఆలయాన్ని సందర్శించడానికి వస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో సౌకర్యాలను పరిశీలించామన్నారు. ఈ కార్యక్రమంలో కర్నాటక రెవిన్యూ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అశ్విన్, డీఎస్పీ యశ్వంత్, ఎస్ఐ మునీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బికెకు సన్మానం

పెనుకొండ : టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారధిని టిడిపి నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. నియోజకవర్గంలోని రొద్దం మండలం ఆర్ కొట్టాల గ్రామానికి చెందిన పుల్లప్ప చౌదరిని రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించిన నేపథ్యంలో గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద బికె పార్థసారథిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పుల్లప్ప చౌదరి పార్థసారథికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, ఉపేంద్ర, నాగభూషణ, ధనుంజయ్ గౌడ్, మురళి, గంటి చంద్ర, వాల్మీకి చంద్ర, అక్బర్, చంద్రశేఖర్ నాయుడు, రాము, మధు, రాజప్ప, పాల వెంకటేష్, ముత్యాలు, ప్రశాంత్, హరికృష్ణ, యాదవ్, ఆదిశేషు, అంజి, చంద్ర, నాగభూషణ, జావీద్, హుజూర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి షూటింగ్ బాల్ జట్టు ఎంపిక

బుక్కపట్నం : మండల కేంద్రంలోని సత్య సాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో జిల్లాస్థాయి షూటింగ్ బాల్ జట్టు ఎంపిక కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా ఇన్‌ఛార్జి సెక్రటరీ పూల ప్రసాద్ తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే వారు ఆధార్ కార్డు తీసుకురావాలని ఆయన కోరారు.



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

తాగునీటి సౌకర్యం కల్పించండి

ప్రజాశక్తి మడకశిర రూరల్

మండలంలోని చౌటుపల్లిలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామ మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం ఖాళీబిందెలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్యను పలుమార్లు నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని విమర్శించారు. కనీసం కొళాయిలు కూడా వేయలేదన్నారు. నీటికోసం ఐదుమైళ్ల దూరం వెళ్లాల్సివస్తోందన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి-హిందూపురం

వాటర్ వర్క్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు వేతనాలను పెంచాలని వాటర్ వర్క్స్ కార్మికులు కోరారు. ఈ విషయంపై మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ జబివుల్లా, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావులకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను గురువారం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఐదు సంవత్సరాలుగా గొల్లపల్లి వాటర్ వర్క్స్‌లో కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. నాడు ఇస్తున్న వేతనాలే నేటికీ ఇస్తున్నారన్నారు. ఇస్తున్న రూ.8500 వేతనం ఏ మాత్రం సరి పోవడం లేదన్నారు కనీస వేతన చట్టం అనుసరించి వేతనాలను పెంచాలన్నారు. దీంతో పాటు పెండింగ్‌లో ఉన్నా వేతనాలను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ కార్మికులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిని ఇస్తున్న వాటర్ వర్క్స్ కార్మికులు

అభివృద్ధి పనులు ప్రారంభం



మరమ్మతుకు గురైన కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

ప్రజాశక్తి కదిరి అర్బన్

పట్టణంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే సిద్ధారెడ్డి గురువారం భూమిపూజ చేశారు. 4వవార్డులో రూ. 8 లక్షలతో దండుబాట, ఎక్స్ ఎంపీ స్ట్రీట్, ఎన్ హెచ్ రోడ్డు టు అప్రోచ్ రోడ్లలో సిమెంట్ కాంక్రీట్ రోడ్లు, డ్రయినేజీల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆస్తులపై బహిరంగ చర్చకు సవితమ్మ సవాల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సవితమ్మ

ప్రజాశక్తి -పెనుకొండ

స్థానిక ఎమ్మెల్యే శంకరనారాయణ ఆస్తులపై బహిరంగచర్చకు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ సవాల్ విసిరారు. పట్టణంలోని తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సవితమ్మ మాట్లాడారు. ఎమ్మెల్యే శంకర నారాయణ మాట్లాడిన తీరును చూస్తుంటే 2024లో ఆయనకు వైసిపి తరపున టికెట్ రాదని తెలుస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. ఆ భయంతోనే తమ నాయకులు చంద్రబాబు నాయుడు, లోకేష్ మీద, తన వ్యాపారాల మీద లేనిపోని వ్యాఖ్యానాలు చేస్తున్నారని విమర్శించారు. ఆయన మాటలు చూస్తుంటే 'దయ్యాలు వేదాలు వల్లించినట్లు' ఉందన్నారు. తాను పక్కా లోకల్ అని తన నా వ్యాపారాలు పక్కా లీగల్ అని అన్నారు. తన వ్యాపారాలు కొత్తగా వచ్చినవి కాదని 20 సంవత్సరాలుగా వ్యాపారాలు చేస్తున్నానని చెప్పారు. ఏరోజూ ఒక్క అవినీతి మరక లేదని అన్నారు. శంకరనారాయణ ఎమ్మెల్యే కాకముందు ఎన్ని ఆస్తులు ఉన్నాయి, ఇప్పుడు ఎన్ని ఉన్నాయి, ఆ ఆస్తులు ఎక్కడ నుండి వచ్చాయని ప్రశ్నించారు. ఈ విషయంపై బహిరంగ చర్చకు సిద్ధమా అని శంకర నారాయణకు బహిరంగ సవాల్ చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే తన నోరును అదుపులో పెట్టుకొని మాట్లాడాలని సూచించారు. ఎమ్మెల్యే సోదరుల అవినీతి గురించి వైసీపీ నాయకులే బహిరంగంగా చెప్తున్నారని ఆరోపించారు. బీసీ సంక్షేమ శాఖమంత్రిగా పనిచేసిన శంకరనారాయణ బిసిలకు చేసింది ఏమీ లేదని అన్నారు. అంతేకాకుండా ఆర్ అండ్ బి శాఖ మంత్రిగా పని చేసిన ఆయన నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూపించాలని సవాల్ చేశారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాతే తన వ్యాపారాలను దెబ్బతీయాలనే ఉద్దేశంతో అక్రమ కేసులు పెట్టించాడని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు వెంకటరమణ, శ్రీరాములు, ఆంజనేయులు, ప్రసాద్, నరసింహులు, గోపాల్, త్రివేంద్ర నాయుడు, మావుటూరు గోపాల్, కౌన్సిలర్ గీతా హనుమంతు, వాసుదేవ రెడ్డి, మంజు, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

పేకాట జూదరులు అరెస్టు

రొద్దం : మండలంలోని చిన్నమంతూరు గ్రామ సమీపంలో చింత చెట్ల వద్ద పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అరెస్టు చేశారు. పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం రావటంతో పోలీసులు దాడులు నిర్వహించారు. మొత్తం 13 మంది జూదరుల్లో ముగ్గురు పారిపోయారు. మిగిలిన 10 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుండి రూ.48,220నగదు, 7 మోటార్ సైకిళ్ళను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

తలుపుల : వార్షిక తనిఖీలో భాగంగా తలుపుల పోలీసుస్టేషన్‌ను కదిరి డీఎస్పీ భవ్య కిషోర్ గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. కేసులు పురోగతిపై ఎస్ఐ మక్బూల్ బాషాను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో రూరల్ సిఐ శంకర్ నాయక్, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

తనకల్లు : మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ సమీపంలో గల చంద్రబాబు నాయుడు కాలనీలో వెంకటేష్ అనే తెలుగుదేశం పార్టీ కార్యకర్త సోదరి రెడ్డమ్మ అనారోగ్యంతో గురువారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జికందికుంట వెంకటప్రసాద్ క్లస్టర్ ఇంచార్జ్ పిజి. మల్లికార్జున ద్వారా మృతుని కుటుంబాన్ని రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

వివాదాస్పద భూమి పరిశీలన

గోరంట్ల : మండలంలోని పాలసముద్రం సమీపన సర్వే నంబర్ 99లోని వివాదాస్పద భూమిని ఆర్డీవో భాగ్యరేఖ, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి గురువారం పరిశీలించారు. తన భూమిని కొంతమంది అధికార పార్టీ నాయకులు కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని తన భూమికి రక్షణ కల్పించాలని బాధిత రైతు రత్నమ్మ గత వారం జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో అధికారులు గురువారం ఆ భూమిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రంగనాయకులు, వీఆర్వో, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

హిందూపురం : హిందూపురం రూరల్ మండలం కె బసవనహళ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోస్తున్న ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీదేవి, షేక్షిఫా, హెల్త్ ఎడ్యుకేటర్ సుశీలమ్మ, సుపర్‌వైజర్లు నాగశేషమ్మ, కళావతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మ రథోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

హిందూపురం : ఈనెల 5న నిర్వహించనున్న పట్టణంలోనిపేట వెంకటరమణ స్వామి బ్రహ్మ రథోత్సవం ఏర్పాట్లపై అధికారులు గురువారం సమీక్ష చేశారు. గురువారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 5న నిర్వహించే బ్రహ్మ రథోత్సవం కార్యక్రమానికి అన్ని వర్గాల వారు సహకరించి, శాంతి యుతంగా జరుపుకుందామన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ ప్రసాద్, సిఐలు వెంకటేశ్వర్లు, లక్ష్మిదుర్గయ్య, ఆర్ఐ భాస్కర్ రెడ్డి, దేవాదాయ శాఖ అధికారులు, హిందూ పరిరక్షణ సమితి సభ్యులు, మైనారిటీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కరాటేలో కదిరి విద్యార్థుల ప్రతిభ

కదిరి అర్బన్ : స్థానిక ఐక్యూఆర్ఎ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో కియో జపాన్ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఇండియా కరాటే బెల్ట్ ఎగ్జామినేషన్ మాస్టర్ అక్బర్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు కరాటే విన్యాసాలు అబ్బురపరిచాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐక్యూఆర్ఎ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ నాసిర్ పాల్గొన్నారు. విద్యార్థిని విద్యార్థులు చేసిన పంచెస్ కిక్స్, కథాస్, టైల్స్ బ్రేకింగ్, గర్ల్స్ హెడ్ తో టైల్స్ బ్రేకింగ్ చేయడం లాంటి విన్యాసాలు అబ్బురపరిచాయి. ఈసందర్భంగా 8 మంది కి ఎల్లో బెల్ట్, ఏడుగురికి ఆరెంజ్ బెల్ట్, ఒకరికి గ్రీన్ బెల్ట్, ఒకరికి బ్లూ బెల్ట్ అందజేసి ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కరాటే ఇన్‌స్ట్రక్టర్లు మహమ్మద్ రఫీ, రియాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సర్వీసులను అడ్డుకున్న విద్యార్థులు



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ప్రజాశక్తి రొద్దం

పెనుకొండ ఆర్టీసీ డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు సర్వీసులను మండలంలోని ప్రభుత్వ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు గురువారం అడ్డుకున్నారు. బస్సులు సమయపాలన లేకుండా నడపడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్న కారణంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు బస్సు సర్వీసులను అడ్డుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రోజు సమయపాలన పాటించకుండా ఎప్పుడుపడితే అప్పుడు బస్సులను నడుపుతున్నామన్నారు. దీంతో తాము సమయానికి కళాశాలకు హాజరుకాలేక పోతున్నామని వాపోయారు. గురువారం మధ్యాహ్నం 3గంటలకు రావాల్సిన బస్సు సాయంత్రం 5 :30 గంటలకు వచ్చిందన్నారు. ఆతరువాత వచ్చిన బస్సు కూడా నిలపకుండా పోవడంతో విసుగు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు బస్సులను అడ్డుకుని నిరసన తెలిపారు. అంతేకాకుండా సమస్యను పెనుకొండ ఆర్టీసీ డిఎమ్‌కు ఫోన్‌ద్వారా సమాచారమిచ్చారు. ప్రస్తుతం విద్యార్థులకు పరీక్ష జరుగుతున్నాయని కనీసం విద్యార్థులు ఇక్కడే ఇంత సమయం వృథా చేస్తే ఇక ఇంటికి ఎప్పుడు వెళ్లి చదువుకోవాలని కళాశాల అధ్యాపకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో బస్సులో నడపాలని గతంలో వినతిపత్రం సమర్పిస్తే ఒకటిరెండు రోజులు సకాలంలో బస్సు సర్వీసులు నడిచాయన్నారు. అనంతరం సమయపాలన పాటించలేదని విమర్శించారు. ఇప్పటికైనా సకాలంలో బస్సు సర్వీసులు నడపాలని వారు కోరారు.

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి

ప్రజాశక్తి-హిందూపురం



కాలనీ వాసులకు మొక్కలను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్ తదితరులు

పట్టణ ప్రజలు విధిగా వారి ఇండ్ల వద్ద మొక్కలు నాటి నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని అప్పుడే హిందూపురం హరిత పురంగా మారుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 11వ వార్డులో గల మాడాల్ కాలనీలో ఏంజిల్ ఐటిఐ, కేర్ స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో వార్డు ప్రజలు మొక్కలను పంపిణీ చేశారు. వార్డు కౌన్సిలర్ అంజలి రమేష్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న చైర్‌పర్సన్‌తో పాటు వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడారు. పురపాలక సంఘ వ్యాప్తంగా మొక్కలను నాటి, వాటిని సంరక్షిస్తే హిందూపురం హరితపురంగా మారుతుందన్నారు. అందుకోసం పురపాలక సంఘ వ్యాప్తంగా అవసరమైన అన్ని సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం వార్డు కౌన్సిలర్‌తో పాటు ప్రజలకు ఉత్తమ అధికారిగా ప్రశంసలు పొందిన మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రహమత్ బి, మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ సెంట్రల్ సీడ్ డైరెక్టర్ రమేష్ రెడ్డి, హ్యూమన్ రైట్స్ డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి, శ్రీరాములు, ఐటిఐ కళాశాల డైరెక్టర్ పెరియనాయగం, ప్రిన్సిపల్ వెంకటేష్, ఫీల్డ్ డైరెక్టర్ లతా, సచివాలయ సిబ్బంది, వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి జనసేన డిమాండ్

ప్రజాశక్తి కదిరి అర్బన్

మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను అధికారులు, పాలకులు వెంటనే పరిష్కరించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి భైరవప్రసాద్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లడతూ మున్సిపాలిటీ పరిధిలో అనేక సమస్యలు తిష్టవేశాయన్నారు. ఈ సమస్యలను పరిష్కరించడానికి వేదికైన మున్సిపల్ మీట్‌లో ఎలాంటి చర్చ జరగకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. దీన్ని బట్టి చూస్తే ప్రజాసమస్యలపై పాలకులకు, అధికారులకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం అవుతోందని ఎద్దేవా చేశారు. 34వ వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ హరిబాబుకు జనసేన పార్టీ తరపున వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ, రాజేంద్ర ప్రసాద్, రవీంద్ర ,రాజేంద్ర ప్రసాద్, కిన్నెర మహేష్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైసిపి హయాంలోనే సంక్షేమం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పెనుకొండ

వైసిపి హయాంలోనే రాష్ట్రం సంక్షేమంగా ఉందని ఎమ్మెల్యే శంకరనారాయణ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని వన్సిక ఫంక్షన్ హాల్‌లో పెనుకొండ పట్టణ, మండలంలోని సచివాలయం కన్వీనర్లు, వాలెంటీర్లు, గృహసారధులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగనన్న ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘన ముఖ్యమంత్రికి దక్కుతుందన్నారు. ఈసందర్భంగా సచివాలయ కన్వీనర్లు, వాలెంటీర్లు, గృహ సారథులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్‌ఉమర్ ఫరూక్, వైస్ చైర్మన్ సునీల్, ఎంపీపీ గీతా రామ్మోహన్ రెడ్డి, జెడ్పీటీసీ శ్రీరాములు, నాయకులు కృష్ణారెడ్డి, నరసింహ, నాగలూరు బాబు, పొగాకు రామచంద్ర, మునిమడుగు శ్రీనివాసులుతో పాటు కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ